## క్లుప్తంగా

### ఉద్యోగులు సక్రమంగా పనిచేయాలి



పోలకల్ సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సందీప్

**సి.బెళగల్:** గ్రామ సచివాలయాలల్లో పనిచేసే ఉద్యోగులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ప్రజల అవసరాలు, సమస్యలను పరిష్కరించడంలో బాధ్యతాయుతంగా పనిచేయాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని పోలకల్ గ్రామంలో పర్యటించి సచివాలయాలను సందర్శించి రికార్డులు, ఉద్యోగుల హాజరు, గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ.. గ్రామాలలో ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు వేగవతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని పోలకల్ గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

### స్నేహితుడి కుమార్తె పెళ్లికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బాల్య స్నేహితులు

**కోడుమూరు రూరల్:** పేదవాడైన మిత్రుడి కుమార్తె పెళ్లికి తోటి స్నేహితులు అండగా నిలిచిన సంఘటన కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ప్యాలకుర్తి గ్రామానికి చెందిన చిన్న రాముడు 1987–88 విద్యా సంవత్సరంలో కోడుమూరులోని బాలుర హైస్కూల్లో పదో తరగతి చదువుకున్నాడు. చిన్న రాముడు తన కుమార్తె వివాహం చేసేందుకు ఈ నెల 31వ తేదీ గురువారం ముహూర్తం నిశ్చయించుకున్నాడు. పెళ్లి చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకున్న తోటి మిత్రులు మురళీధర్‌గౌడ్, రత్నాకర్‌రెడ్డి, జీతూరి రవి తదితరులు చేయిచేయి కలిపి రూ.50 వేలను పోగు చేసి గురువారం ప్యాలకుర్తిలో జరిగిన పెళ్లి వేడుకలో మిత్రుడు చిన్నరాముడుకు అందజేసి గొప్పతనం చాటుకున్నారు. సాయం అందించడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు.

### వరి సాగులో మెలకువలతో అధిక దిగుబడి



కొండాపురంలో పొలం బడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

**సి.బెళగల్:** రైతులు వరి పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏఈఓ సిద్దు అన్నారు. మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఏఈఓ గురువారం మండలం పరిధిలోని గుండ్రేవుల, కొండాపురం గ్రామాలలో గ్యాప్ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్)లో భాగంగా వ్యవసాయ అధికారులు, సిబ్బందితో కలిసి వరి పొల్లాల్లో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి పంట సాగు విధానంపై అవగాహన కల్పిస్తూ, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయ (జెడ్‌బీఎన్‌ఎఫ్ – జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్) పద్ధతులను తెలియజేశా రు.ఈ సందర్భంగా వరి పొలంలో కాలిబాట ను ఏర్పాటు చేయించి, సస్యరక్షణ పద్ధతులను వివరించారు. వరి సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడం, పంటల సంరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ నాయక్, ఎంపీఈఓలు, జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

### ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలి



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

**గూడూరు:** ఓటరు జాబితా సవరణ కార్యక్రమం బీఎల్‌ఓలు పకడ్బందీ గా నిర్వహించాలని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌ఓలతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు పని చేయాలన్నారు. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయసు నిండేవారికి ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని ఆదేశించారు.

# జగనన్నతోనే సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఎన్. కొంతలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం





కన్నమడకలలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, తిరుమలగిరిలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

**ఓర్వకల్లు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లోనే పారదర్శకమైన సంక్షేమ పాలన సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచు మధుకేశన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా యాగంటీశ్వరస్వామిని దర్శించుకొని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 188 ఇళ్ల పట్టాలను మంజూరు చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. స్టీల్ ప్లాంట్‌లో భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందజేసిన ఘనత తమదే అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుమ్మరి మద్దయ్య, మల్లికార్జునప్ప, మాధవస్వామి, రాముగౌడు, కొట్టాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలకు శాశ్వత పరిష్కారం**

మండలంలోని కన్నమడకల గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామ సర్పంచు వడ్డె పెద్ద కాశీం ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముందుగా రూ.55 లక్షలతో ఎస్సీ, బీసీ కాలనీలలో నిర్మించిన సీసీ రోడ్లు, కుందూ వాగుపై నిర్మించిన కాజ్‌వే వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో కొన్నేళ్ల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కిందన్నారు. ఎయిర్ పోర్టుకు వెళ్లే రైతులకు రహదారి సమస్యను రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

**ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళలు**

**పాణ్యం :** ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి పలువురు మహిళలు రాఖీ కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. పాణ్యం ఎంపీపీ ఉసేన్‌బీ, మండల పొదుపు మండల సమాఖ్య అధ్యక్షురాలు సరళమ్మతో పాటు పలువురు పొదుపు మహిళలు ఎమ్మెల్యే నివాసం వద్దకు వెళ్లి రాఖీ కట్టారు. కార్యక్రమంలో సుబ్బమ్మ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

**అర్హతే ప్రమాణికంగా పథకాలు**

**కల్లూరు:** పార్టీలు, రాజకీయాలు, మతాలు, కులాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 28వ వార్డు తిరుమలగిరిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలో పర్యటిస్తూ వృద్ధును, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం నుంచి పొందిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా కాలనీలో పలువురు మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ పట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవుల్లో, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేటర్లు తదితర పదవుల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, శివారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా జీవించాలి

**కోడుమూరు రూరల్:** గ్రామాల్లోని ప్రజలందరూ చిన్న చిన్న విషయాలకు గొడవలు, అల్లర్ల జోలికెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని కర్నూలు డీఎస్పీ విజయ్‌శేఖర్ సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని అమడగుంట్ల గ్రామంలో డీఎస్పీ విజయ్‌శేఖర్ కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి పర్యటించి ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలంతా ఆన్‌లైన్, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు, ఆధార్ వంటి వివరాలు కోరితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పరాదన్నారు.ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపే సమయంలో రోడ్డునిబంధనలు తప్పక పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో తిరిగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

### అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



ఓ.సంపత్

**పాణ్యం:** మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఓ.సంపత్‌కు ఆర్‌యూ (రాయలసీమ యూనివర్శిటీ) పీహెచ్‌డీ ప్రధానం చేసినట్లు ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ పి.సూర్యనారాయణ పర్యవేక్షణలో ఎనర్జీ ఎఫిసిట్ రూటింగ్ స్ట్రాటజీ ఇన్ హోట్రోజీనీయస్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్‌పై చేసిన పరిశోధనలకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ ఆశోక్‌కుమార్, రామిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు ఆయన్ను అభినందించారు.

## వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి



ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

**కల్లూరు:** వైద్యాధికారులు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. గురువారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం చెట్లమల్లాపురం గ్రామంలో జరుగుతున్న ప్యామిలీ ఫిజిషియన్ సేవలకు హాజరయ్యారు. అక్కడికి వచ్చిన వారికి సేవలు అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు గ్రామంలో అంటువ్యాధులు ప్రభాలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

## సహోద్యోగి కుటుంబానికి అండగా..



మృతుడి భార్య జయమ్మకు బాండు అందజేస్తున్న ఈఈ రమణారెడ్డి

**గడివేముల:** తోడబుట్టిన వారు ఆపదలో ఉంటే కూడా ఆదుకునేందుకు ఆలోచించే వ్యక్తులు ఎంతో మంది ఉన్నారు. తాము బాగుంటే చాలు ఎవరి గురించి మాకొద్దు అనుకునే వారు ఉన్నారు. కన్నవారినే కష్టాలలో వదిలేసే వారున్న ఈ సమాజంలో స్నేహితుడి కుటుంబానికి మేమున్నామంటూ తోటి ఉద్యోగులు అండగా నిలిచారు. కష్టాల్లో ఉన్న తోటి ఉద్యోగి కుటుంబం గురించి తెలుసుకుని స్నేహహస్తం అందించారు. వివరాల్లోకి వెళ్లితే.. గడివేముల మండల పరిధిలోని గని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చాకలి మధు జూన్ 28న అనారోగ్యంతో మృతి చెందాడు. కష్టాల్లో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు విద్యుత్ కాంట్రాక్టు కార్మిక 3045 యూనియన్ సభ్యులు మధు ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం వారందరూ పోగు చేసిన రూ.లక్ష మొత్తాన్ని మధు కూతూరు మధుప్రియ పేరిట నంద్యాల ఎల్‌ఐసీలో డిపాజిట్ చేసి బాండును నంద్యాల ఈఈ రమణారెడ్డి చేతుల మీదుగా గురువారం మధు భార్య జయమ్మకు అందజేశారు. మృతుడి కుటుంబంలో కారుణ్య నియామం కింద భార్యకు ఉద్యోగం వచ్చే విధంగా చూస్తానని ఈఈ తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎల్లాల శరత్ కుమార్, నంద్యాల డివిజన్ అధ్యక్షుడు గోపాల్, కరీం, శ్రీనివాసరెడ్డి, మున్ని, అనూష, లావణ్య, మధు, నాగేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

## నగర పాలక సంస్థ అభివృద్ధికి పాటుపడాలి



కారుణ్య నియామక పత్రం అందిస్తున్న మేయర్ రామయ్య

**కల్లూరు:** కష్టపడి పని చేసి నగర పాలక సంస్థ అభివృద్ధికి పాటు పడాలని కారుణ్య నియామకం కింద నియమితులైన పారిశుద్ధ్య కార్మికుడికి నగర మేయర్ బీవై రామయ్య సూచించారు. నగర పాలకసంస్థలో పని చేస్తున్న కె.బీసన్న అనే పారిశుద్ధ్య కార్మికుడు (మలేరియా విభాగం) ఈ ఏడాది మే12న మృతి చెందాడు. కాగా కారుణ్య నియామకం కింద ఆయన కుమారుడు కె.శివశంకర్‌కు ఉద్యోగం కల్పించారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని గురువారం మేయర్ క్యాంపు కార్యాలయంలో మేయర్ రామయ్య అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేనేజర్ చిన్న రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షం కోసం వరుణ సంకల్ప ధ్యానం



వరుణ సంకల్ప ధ్యానం చేస్తున్న భక్తులు

**సి.బెళగల్:** వర్షాలు కురవాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలో మండల పిరమిడ్ ధ్యాన కేంద్రం వారి ఆధ్వర్యంలో వరుణ సంకల్ప ధ్యానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం నాలుగు గంటలకు గ్రామంలో శాఖాహార ర్యాలీని నిర్వహించారు. అనంతరం గ్రామంలోని కోట వీధిలో వెలసిన శ్రీ రాజరాజేశ్వరి దేవాలయ ఆవరణలో వరుణ సంకల్ప ధ్యానం చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన మండల పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పోరాటాలతోనే హక్కుల సాధన



నినాదాలు చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

**కర్నూలు (న్యూటౌన్) :** రాజ్యాంగ హక్కులు దక్కాలంటే కేవలం పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాస్ నాయక్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన లంబాడీ హక్కుల పోరాట సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాజ్యాంగ హక్కులు సాధించుకోవడానికి ప్రతిఒక్క లంబాడీ బిడ్డలు ఐకమత్యంతో ముందుకు రావాలన్నారు. హమారా జల్ జమీన్ జంగల్ సాధన కోసం భవిష్యత్తు ప్రణాళిక త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా అధ్యక్షుడు దేశవత్ హరిబాబు నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, లక్ష్మానాయక్, మంత్రుల నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి



గడిగరేవులలో ఈ క్రాప్ బుకింగ్ చేస్తున్న వీఏఏ

**గడివేముల:** మండలంలో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి కోరారు. గురువారం గడిగరేవుల, బూజునూరు గ్రామాలలో జరుగుతున్న ఈ క్రాప్‌ను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏఓ మాట్లాడుతూ.. పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందించే ప్రతి పథకం ద్వారా లబ్ధిపొందవచ్చన్నారు. రైతులందరూ సెప్టెంబర్ 15వ తేదీలోపు ఆయా గ్రామాలలో ఆర్బీకేల్లోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని కోరారు.

# వైఎస్సార్‌సీపీతో అర్హులందరికీ పథకాలు



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

**కర్నూలు (న్యూటౌన్):** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో నిలిచారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ పరిధిలోని శిల్పాటౌన్ షిప్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు అధికారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు.వైఎస్సార్‌సీపీ నాయకులు హరినాథ్‌రెడ్డి, రామ్‌నాథ్‌రెడ్డి, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వాసు, రామరాజు, ఎంపీడీఓ అజాం ఖాన్,పీఎస్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

**మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం**

**కర్నూలు (న్యూటౌన్):** మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం సాయంత్రం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో రాఖీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే మహిళలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్న సంకల్పంతోనే జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, రూ.లక్షలు విలువ చేసే ఇళ్ల పట్టాలు మహిళల పేరిట అందజేస్తున్నారన్నారు. అనంతరం మహిళలందరూ ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎమ్మెల్యే సుధాకర్‌కు రాఖీ కడుతున్న మహిళలు

**మెప్మా ఆధ్వర్యంలో 'ఆహా' క్యాంటీన్లు**

**గూడూరు:** పేదల కోసం మెప్మా ఆధ్వర్యంలో ప్రభుత్వం 'ఆహా' క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పేదల కోసం ఈ క్యాంటీన్‌లో అతి తక్కువ ధరకు భోజనం అందిస్తామని తెలిపారు. మెప్మా జిల్లా జీవనోపాధుల అధికారి జిలానీ బాష మాట్లాడుతూ.. ఆహా క్యాంటీన్‌లలో చిత్రాన్నం, వెజిటబుల్ రైస్, పెరుగన్నం, తదితర వంటకాలు రూ.30 కే అందిస్తామన్నారు. ప్రతి రోజు 12 గంటల నుంచి 2 గంటల వరకు ఈ క్యాంటీన్ పొదుపు మహిళల ఆధ్వర్యంలో పని చేస్తుందని ఆయన తెలిపారు. పొదుపు మహిళలు ఇంటి దగ్గరే వంటలు తయారు చేసుకుని క్యాంటీన్ లో అమ్మకాలు చేస్తారని, దీని ద్వారా పొదుపు మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందుతారన్నారు. మెప్మా సీఎంఓ సూర్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ బోయ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జే.ఆబేల్, కౌన్సిలర్లు ఖలీల్, విజయ్, మద్దిలేటి, కో ఆప్షన్ సభ్యుడు మదార్, నాయకులు పత్తి రంగడు,మెప్మా సిబ్బంది మద్దమ్మ, విజయ్, ఆర్పీలు పాల్గొన్నారు.

### ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించాలి

**కల్లూరు:** సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ జయరాముడు అధ్యక్షతన వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు బీమా నమోదు కార్యక్రమం నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ మాట్లాడుతూ పార్టీ కోసం పాటుపడే ప్రతి ఒక్కరికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అండంగా ఉంటారన్నారు. రాబోయ్యే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అన్ని స్థానాల్లో విజయఢంకా మోగిస్తుందన్నారు.

### కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేత

**గూడూరు:** సుంకేసుల జలాశయం నుంచి గురువారం కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో నిలిచి పోయింది. ప్రస్తుతం జలాశయంలో 0.661 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

# కొత్త పింఛన్ల మంజూరు

- పాణ్యం నియోజకవర్గంలో కొత్తగా 591 మందికి పింఛన్లు
- మొత్తం 27,969 మంది లబ్ధిదారులు
- నేటి నుంచి నగదు పంపిణీ

**మండలాల వారీగా పింఛన్ల వివరాలు..**

| మండలం | పాతవి | కొత్తవి | మొత్తం |
|---|---|---|---|
| పాణ్యం | 6,208 | 134 | 6,342 |
| గడివేముల | 5,583 | 131 | 5,714 |
| ఓర్వకల్లు | 7,452 | 192 | 7,644 |
| కల్లూరు | 8,135 | 134 | 8,269 |
| మొత్తం | 27,378 | 591 | 27,969 |

**పాణ్యం /కల్లూరు:** మండలంలో కొత్తగా 134 పింఛన్లు మంజురయ్యాయి. శుక్రవారం ప్రారంభమయ్యే పింఛన్ల పంపిణీలో కొత్త వారికి కూడా కలిపి ఈనెల నగదు అందిచేందుకు అధికారులకు ఆదేశాలు అందాయి. ఇప్పటికే ఆయా సచివాలయాలకు సంబధించి కొత్త పింఛన్ జాబితా అందించారు. గతంలో మొత్తం 6,208 పింఛన్‌లు ఉండగా, కొత్తగా 134 పింఛన్లు వచ్చాయి. వృద్ధాప్యం -3,398, వితంతవు-1,675, వికలాంగులు-687, ట్రాన్స్‌జెండర్-19, మత్స్యకారులు-75, ఒంటరి మహిళ- 93, డప్పు కళాకారులు-49, చర్మకారులు-9, చేనేత కార్మికులు-1, డీఎంఅండ్‌హెచ్‌ఓ-58, అభయహస్తం-144ల రకాల పింఛన్లు వస్తున్నాయి.

**కొత్త పింఛన్లు గ్రామాల వారీగా..**

ఆలమూరు-4, బలపనూరు-12, భూపనపాడు-5, గోనవరం-4, గోరుకల్లు-10, కందికాయపల్లె-02, కొండజుటూరు-5, కౌణిదేడు-10, కొలుదు-4, మద్దూరు-6, పాణ్యం-33, కొత్తూరు-12, సుగాలిమెట్ట-3, తమ్మరాజుపల్లె- 7 వారీగా పింఛన్లు మంజూరు చేశారు. ఇందుకు సంబధించి రూ. 1,72,45,500లు నంగదు మంజూరైందని అధికారులు తెలిపారు.

# పట్టాల పంపిణీతో అవధుల్లేని ఆనందం

- గ్రామంలో 40 ఏళ్ల తరువాత ఇంటి పట్టాల పంపిణీ
- గడివేములలో పార్టీలకు అతీతంగా 265 మందికి ఇళ్ల స్థలాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



గడివేములలో ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని (ఫైల్)

**గడివేముల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పట్టాలు తీసుకున్న మహిళలు పట్టలేని ఆనందంలో మునగిపోయారు. రాష్ట్రంలో సొంతిల్లు లేని నిరుపేదలు ఉండకూడదన్న లక్ష్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దాదాపు 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందించారు. దీంతో పేదలు సంతోషంగా ఉన్నారు. గడివేముల గ్రామంలో 40 ఏళ్ల నుంచి ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం జరగలేదు. 2021 జనవరి నెలలో గడివేములలోని అర్హులైన వారందరికీ బొల్లవరం రస్తాలో ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఆ స్థలం ఇంటి నిర్మాణాలకు అనువుగా లేకపోవడంతో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వేరే చోట స్థలం చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో గడివేములలోని ఎస్‌ఆర్‌బీసీ కాలనీలో ఉన్న 11 ఎకరాలను గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి ఉత్తర్వులు మంజూరు చేయించారు.

**265 మందికి ఇంటి పట్టాల పంపిణీ**

స్థానిక ఎస్‌ఆర్‌బీసీ కాలనీలో లేఅవుట్ వేసి రోడ్లు, ప్లాట్ నెంబర్లు వేసి లేఅవుట్ సిద్ధం చేశారు. ఇంత పెద్ద ఎత్తున ఇంటి పట్టాల పంపిణీ చేయడం గ్రామంలో ఇదే మొదటిసారని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో అర్హులైన వారందరికీ ఈ నెల 23వ తేదీన లేఅవుట్ వద్దనే ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. దీంతో గత కొన్ని సంవత్సరాలుగా బాడుగ ఇళ్లలో జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ఇంటి స్థలం మంజూరు కావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

### పెళ్లయినప్పటి నుంచి అద్దె ఇంట్లోనే ఉంటున్నాం



నాకు దాదాపు 12 ఏళ్ల కిందట పెళ్లయ్యింది. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే జీవనం సాగిస్తున్నాం. నేను ఎన్నడూ కార్యాలయాల చుట్టూ తిరగలేదు. గ్రామ వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లాడు. ప్రభుత్వం అన్ని అర్హతలు పరిశీలించి ఇంటిపట్టా మంజూరు చేసింది. దీంతో మాకుటుంబం చాలా సంతోషంగా ఉన్నాము. మేమందరము ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీటీసీకి రుణ పడి ఉంటాం.

– కల్కి చండీప్రియ, గడివేముల

### ఎమ్మెల్యే కృషితోనే ఇళ్ల స్థలాలు మంజూరు



గత కొన్నేళ్లుగా సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్న వారికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సహకారంతో ఇంటి పట్టాలు మంజూరయ్యాయి. ఇంకా గ్రామంలో అర్హులు ఉంటే గుర్తించి ఇంటి పట్టాలు అందిస్తాం. స్థానిక జగనన్న లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. 40 ఏళ్ల అనంతరం ఇంత పెద్ద ఎత్తున్న ఇంటి స్థలాలు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– చంద్రశేఖరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, గడివేముల